www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

5

పశ్చిమ గోదావరి



ఏసురత్నానికి డాక్టరేట్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు శివరావుపేటకు చెందిన అసిస్ట్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు తానేటి ఏసురత్నానికి డాక్టరేట్ లభించింది. సామాజిక సేవా, సువార్త పరిచర్యలో భాగంగా ఆయనకు గురువారం రాజమండ్రిలో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ పోలీస్ ఎపిస్కోపల్ డయోసిస్ సంస్థ నిర్వహించిన కాంగ్రిగేషన్లో డాక్టరేట్ ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం సందర్భంగా ఆచంట నియోజకవర్గం, పాలకొల్లు, తణుకు పరిసర ప్రాంత దైవజనులు, పాస్టర్లు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, జల వనరులశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, జెడ్పిటిసి సభ్యులు కర్రి.గౌరి సుభాషిణి, ఎంపిపిలు అభినందించారు.

పట్టభద్రుల పోలింగ్ ప్రశాంతం

జిల్లావ్యాప్తంగా 69.80 శాతం ఓట్ల నమోదు

ఓటేసిన ప్రముఖులు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ చదలవాడ నాగరాణి



ఆకివీడులో బారులు తీరిన ఓటర్లు



ఓటేసిన మంత్రి నిమ్మల









ఓటేసిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగింది. ఎండ తీవ్రత నేపథ్యంలో ఓటర్లు ఉదయం నుంచి పోటెత్తుతారని భావించినప్పటికీ ఉదయం 10 గంటలకు కేవలం 10.61 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు 26 శాతం, రెండు గంటలకు 45.6 శాతం, సాయంత్రం 4 గంటలకు పోలింగ్ పూర్తయ్యేసరికి 69.80 శాతం పోలింగ్ నమోదైంది. పిఎస్ఎం గర్ల్స్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 391లో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, ఆయన సతీమణి క్రాంతిరేఖ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 389వ పోలింగ్ బూత్‌లో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆకివీడు జెడ్‌పి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉప సభాపతి, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పిఎస్ఎం గర్ల్స్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. భీమవరం కలెక్టరేట్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ నాగరాణి, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు పరిశీలించారు. భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పిఎస్ఎం గర్ల్స్ హైస్కూల్, బిహెచ్ఆర్ఎం హైస్కూల్, లూథరన్ హైస్కూల్, వీరవాసరం జెడ్‌పి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓట్లు అభ్యర్థించారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి భీమవరంతోపాటు పాలకోడేరు, అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.విజయరామరాజు, కాళ్ల, ఆకివీడు, గణపవరం, పెంటపాడు, తాడేపల్లిగూడెం, వీరవాసరం, పాలకోడేరు మండలాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓట్లు అభ్యర్థించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణ, ప్రసాద్, పట్టాభిరామయ్య, ఏసుబాబు, సీతారామరాజు, జేమ్స్, క్రాంతిబాబు, ఎం.ఆంజనేయులు, త్రిమూర్తులు, రమణరావు, లక్ష్మణ్, అశ్రియ్య పాల్గొన్నారు.

ప్రజాగొంతుక విజయం సాధించాలి

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో నా ఓటు హక్కు వినియోగించుకున్నా. కచ్చితంగా పట్టభద్రులు, నిరుద్యోగుల తరఫున వారి ఆశలు, ఆకాంక్షలు, సమస్యలు తీర్చే ప్రజా గొంతుకగా నిలిచే అభ్యర్థి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. రాబోయే రోజుల్లో శాసనమండలిలో పట్టభద్రుల నుండి ఎన్నికైన అభ్యర్థి పట్టభద్రులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజల సమస్యలపై పోరాటం చేసేలా ఉండాలి.

సేవాగుణం గల వ్యక్తిని ఎన్నుకోవాలి

భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల శాఖ సహాయ మంత్రి

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యతగా పట్టభద్రులు వ్యవ హరించాలి. ఓటు వేయడం బాధ్యతగా నాగాలాండ్ నుండి వచ్చి ఓటు హక్కు వినియోగించు కున్నాను. పట్టభద్రులు సేవాగుణం గల వ్యక్తిని ఎన్నుకోవాలి.

మేధావుల స్థానాల్లో రాజకీయం బాధాకరం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

రాజకీయ పార్టీలు అధికారం దక్కాక ప్రజల కోసం మాట్లాడరు. ప్రజలకు వ్యతిరేకంగా తీర్మానాలు, చట్టాలు చేస్తారని ఆనాడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆలోచించి ఉపాధ్యాయులకు, గ్రాడ్యుయేట్లకు పది ఎంఎల్‌సి స్థానాల్లో పోటీ చేసేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. కొంతమంది మేధావులు శాసనమండలిలో ఉంటే వాళ్లు ప్రజల వైపు ఆలోచన చేస్తారని స్థానాలను కేటాయిస్తే వాటిలో రాజకీయం పులుముకోవడం అత్యంత బాధాకరం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ఈ స్థానాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతుంది. 2007 నుంచి కొంతమంది మేధావులు, టీచర్లు, విద్యావంతులను పిడిఎఫ్ పోటీకి నిలిపింది. 14 మంది 26 సార్లు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచారు. గెలిచిన తర్వాత ఇటు పాలకపక్షం, అటు ప్రతిపక్షానికి ఒరిగిపోకుండా ప్రజలపక్షాన నిలబడింది పిడిఎఫ్ ఎంఎల్‌సిలే. అటువంటి పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో ఉన్న దిడ్ల వీర రాఘవులు ఉపాధ్యాయునిగా పని చేసి అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారు. రెండు జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రుల నుంచి పిడిఎఫ్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. పోలింగ్ సరళిని చూస్తుంటే మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే దిడ్ల వీరరాఘవులు గెలుస్తారని తెలుస్తోంది.

ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం



మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆచంట

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు బలమైన ఆయుధమని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ సిట్టింగ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నిక సందర్భంగా గురు వారం స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఐవి విలేకరులతో మాట్లాడుతూ హంగు, ఆర్భాటాలకు దూరంగా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా సమస్యలపై పిడిఎఫ్ నిర్వహించిన ప్రచారం అమితంగా ఆకట్టుకుందన్నారు. గతంలో పిడిఎఫ్ నెరవేర్చిన పోరాటాల వారసత్వం అభ్యర్థులకు బాగా కలిసొచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.మోహన్‌రావు, ఎస్‌విఎన్.శర్మ, బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, పిల్లి చంటిబాబు, కొండేటి సత్యనారాయణ, కుసుమ జయరాజు, దేవబత్తుల రాధాకృష్ణ, మన్నె బ్రహ్మయ్య, బొర్రా ధర్మారావు, బొర్రా చైతన్య, ఉన్నమట్ల ప్రసాద్, కరిణి బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రంలోకి మంత్రి నిమ్మల..!

పోలింగ్ సిబ్బంది లేచి నిలబడటంపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా యలమంచిలిలోని నెంబర్-1 పాఠశాల, గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం పరిశీలించారు. మంత్రి పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించగానే పోలింగ్ సిబ్బంది మొత్తం లేచి నిలబడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో పోలింగ్ తీరును పరిశీలించడానికి వచ్చిన మంత్రి క్యూలైన్లలో ఎక్కువ మంది ఓటర్లు నిల్చొని ఉండటం చూసి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి అధికారితో మాట్లాడారు. బూత్‌లో ఒకే ఓటింగ్ కంపార్టుమెంట్ ఉండటంతో మరో కంపార్టుమెంట్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులతోనూ ఫోన్లో మాట్లాడారు. లేనిపక్షంలో ఓటర్లు నిల్చోలేక వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమయంలో మంత్రితోపాటు పలువురు టిడిపి నేతలు కూడా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడం, దీనిపై అధికారులు అభ్యంతరం తెలపకపోవడం గమనార్హం.

నిధులిస్తారా.. హ్యాండిస్తారా..

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తారా

చింతలపూడి, తాడిపూడికి నిధులు కేటాయించేనా

డెల్టా ఆధునికీకరణకు కేటాయింపులు ఉండేనా

ఆక్వా, వరి రైతులకు ప్రోత్సాహకాలు దక్కేనా

కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి నిధులిచ్చేనా

నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ కార్యరూపం దాల్చేనా

నేడు అసెంబ్లీలో 2015-26 బడ్జెట్



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారా.. మళ్లీ చెయ్యిస్తారా అనే చర్చ సాగుతోంది. అఖండ మెజార్టీతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం గతేడాది నవంబర్ 11న పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు అరకొరగా సాగగా, కేటాయించిన నిధులు సైతం ఖర్చుపెట్టని పరిస్థితి ఉంది. దీంతో అన్ని స్థానాల్లో గెలిపించిన ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఏమాత్రం న్యాయం జరగని పరిస్థితి ఉంది. ఈ బడ్జెట్‌లోనైనా నిధులిస్తారా అనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో పోలవరం నిర్వాసితుల సమస్య ప్రధానమైంది. ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 107 గ్రామాలకు సంబంధించి 21 వేల కుటుంబాలను తరలించాల్సి ఉంది. సర్వంకోల్పోతున్న నిర్వాసితులకు గత వైసిపి ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ కింద కుటుంబానికి రూ.పది లక్షలు ఇస్తామని, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇస్తామని చెప్పింది. ఐదేళ్లలో వైసిపి చిల్లిగవ్వ ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఇటీవల జిల్లాలోని నిర్వాసితులకు రూ.250 కోట్లు వరకూ విడుదల చేసినప్పటికీ 2014లో ప్రకటించిన రూ.6.25 లక్షల ప్యాకేజీ మాత్రమే ఇచ్చింది. రూ.పది లక్షల ప్యాకేజీ ఇవ్వలేదు. దీంతో నిర్వాసితులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. భూములకు పరిహారం గురించి మాట్లాడటం లేదు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం విషయంలో 2017 కటాఫ్ తేదీగా నిర్ణయించడాన్ని నిర్వాసితులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో నిర్వాసితుల సమస్యలు తెలుసుకునేందుకు గ్రామసభలు నిర్వహించాలంటూ ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ప్రతిపాదించారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం అందకపోవడంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న వరదలకు నిర్వాసితులు నెలలు తరబడి పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కేంద్రం నుంచి నిధులు తెచ్చి నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సి ఉంది. పోలవరానికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు ఏవిధంగా కేటాయిస్తారో వేచిచూడాలి.

చింతలపూడి, తాడిపూడికి నిధులిచ్చేనా..?

చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయితే ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో 4.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తాడిపూడి ప్రాజెక్టుకు పిల్ల కాల్వలు పూర్తి చేస్తే 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. దశాబ్దాలు గడిచినా ఈ సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చింతలపూడికి రూ.150 కోట్లు కేటాయించినట్లు చూపించినా ఖర్చు పెట్టలేదు. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అందుకు రూ.3,782 కోట్లు అవసరమని జలవనరుల శాఖ అంచనా వేసింది. 2026 జూన్‌కు తొలిదశ పనులు పూర్తి చేస్తామని చెప్పింది. ఈ ప్రకారం ఈ బడ్జెట్‌లో తక్కువగా లెక్కించినా రూ.1500 కోట్లకుపైగా కేటాయించాల్సి ఉంది. నిధులు కేటాయిస్తారో, లేదో వేచిచూడాలి. తాడిపూడికి నిధులు కేటాయించి పిల్ల కాలువలు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్టు 2006లో ప్రారంభమైంది. మరో రూ.200 కోట్లు కేటాయిస్తే పనులు చాలావరకూ పూర్తయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. నిధులు కేటాయిస్తారో, లేదో వేచిచూడాలి.

పడకేసిన డెల్టా ఆధునికీకరణ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్, రబీలో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా ఉప కాలువలు ఉన్నాయి. 2007లో అప్పటి ప్రభుత్వం రూ.1,416 కోట్లు కేటాయిస్తూ ఆమోద ముద్ర వేసింది. దాదాపు రూ.800 కోట్లు వరకూ పనులు జరిగాయి. పెరిగిన ధరలతో ఉన్న పనులు చేయాలంటే మరో రూ.వెయ్యి కోట్లు వరకూ ఖర్చు చేస్తే తప్ప డెల్టా ఆధునికీకరణ పూర్తయ్యే పరిస్థితి లేకుండాపోయింది. గత బడ్జెట్‌లో డెల్టా ఆధునికీకరణకు రూ.25 కోట్లు కేటాయించినట్లు చూపినా ఖర్చు చేయలేదు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఆధునికీకరణను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వమైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించి డెల్టా ఆధునికీకరణ పూర్తి చేస్తుందో, లేదో చూడాలి.

ఫిషింగ్ హార్బర్, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి నిధులిస్తారా?

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని 2014-19లో టిడిపి ప్రభుత్వం చెప్పింది. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఫిషింగ్ హార్బర్ పనుల్లో కదలిక ఉంటుందో, లేదో అనే చర్చ సాగుతోంది. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణానికి గత వైసిపి ప్రభుత్వం రూ.450 కోట్లు కేటాయించింది. ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించి రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తి చేయాలని జనం కోరుతున్నారు.

రైతులకు ప్రోత్సాహకాలు లభించేనా..?

జిల్లాలో అతి పెద్ద సాగుగా వరి ఉండగా, మరో రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. రొయ్యకు సరైన ధర లేకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. మేత ధరలు పెరిగిపోయి పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగింది. దీంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. వరి రైతులకు సైతం బోనస్ వంటి ప్రోత్సాహకాలు లేకుండాపోయాయి. బడ్జెట్‌లో వరి, ఆక్వా రైతులకు ప్రోత్సాహకాలు అందించేలా ఏమైనా నిధులిస్తారా వేచిచూడాలి.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



పెనుగొండ ఆసుపత్రిలో బాధితురాలికి చికిత్స

ప్రజాశక్తి - పెనుగొండ

ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దొంగరావిపాలేనికి చెందిన పిల్లి లక్ష్మి (55) దేవ గ్రామంలో పంచాయతీ చెరువులో ఉపాధి పనులకు ఆ గ్రామంలోని సహచర కూలీలతో కలిసి గురువారం ఉదయమే వచ్చింది. పనులు పూర్తి చేసుకుని గురువారం మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటో కోసం వేచిచూస్తుండగా పిల్లి లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో అదే గ్రామంలో 104 వాహనంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం వద్దకు సహచర కూలీలు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పెనుగొండలోని పిహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. భర్త మరణించాడు. ఈ విషయం తెలిసిన ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ స్పందిస్తూ పిల్లి లక్ష్మి మృతి బాధాకరమని, ఆ కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని తెలిపారు.

హోరాహోరీ..!

టిడిపి, పిడిఎఫ్ మధ్య నువ్వానేనా అన్నట్లు ఎంఎల్‌సి ఎన్నికల ఫైట్

తూర్పు, పశ్చిమలో మొత్తం 63.28 శాతం పోలింగ్ నమోదు

ఉదయం నుంచి మందకొడిగా సాగిన ఓటింగ్ ప్రక్రియ

మధ్యాహ్నం నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద అధికార పార్టీ నేతల ఇష్టారాజ్యం

యలమంచిలి పోలింగ్ కేంద్రంలోకి మంత్రి రామానాయుడు, అనుచరులు

ఎన్నికల నిబంధనలు బేఖాతరు చేస్తూ నిల్చొని మంత్రికి సలాం కొట్టిన సిబ్బంది

పెదవేగి పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లు, అడ్డు చెప్పిన పిడిఎఫ్ నాయకులపై టిడిపి నేతల దాడి

పాలకొల్లులో ఓటుకు రూ.వెయ్యి పంపిణీపై తీవ్ర చర్చ, శిబిరాల పేరుతో హల్‌చల్



భీమవరం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పశ్చిమగోదావరి కలెక్టర్ నాగరాణి



ఏలూరు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. గురువారం జరిగిన ఓటింగ్ ప్రక్రియలో 63.28 శాతం మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 3,14,984 మంది ఉండగా సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 1,99,325 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. రెండు జిల్లాల్లో మొత్తం 456 కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవ్వగా మొదటి నుంచి మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో 5.77 శాతం మాత్రమే పోలింగ్ జరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 12 గంటలకు 26.04 శాతం, రెండు గంటలకు 45.29 శాతం, సాయంత్రం నాలుగు గంటలకు 63.28 శాతం పోలింగ్ నమోదైంది. రెండు గంటల నుంచి నాలుగు గంటల మధ్య ఓటింగ్ కొంత ఎక్కువగా సాగింది. 35 మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో బ్యాలెట్ పెద్దగా ఉండటంతో ఎన్నికల అధికారులు చెప్పిన విధంగా మడత పెట్టి బ్యాలెట్ బాక్సులో వేసేందుకు ఓటర్లు ఇబ్బంది పడ్డారు. సచివాలయ ఉద్యోగులంతా కొత్తగా ఓటు నమోదు చేసుకోవడంతో ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్య నువ్వా.. నేనా అన్నట్లు ఎన్నికల పోరు సాగింది. పిడిఎఫ్ అభ్యర్థికి అనుకూలంగా ఓటింగ్ జరుగుతుందని ప్రచారం సాగడంతో మధ్యాహ్నం నుంచి కూటమి నేతలు పోలింగ్ కేంద్రాల వద్ద ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లిపోవడం, అడ్డు చెప్పిన పిడిఎఫ్ నాయకులపై దాడికి దిగడం వంటి ప్రక్రియ సాగింది. అధికార పార్టీ నేతలు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నప్పటికీ పోలీసులు, ఎన్నికల అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు.

ఎన్నికల నిబంధనలు తూచ్.. అధికార పార్టీ నేతలకు అధికారుల సలాం..

ఎన్నికల నిబంధనలను అధికారులు పూర్తిగా తుంగలో తొక్కిన పరిస్థితి ఉంది. మంత్రి నిమ్మల రామానాయుడు యలమంచిలి మండల కేంద్రంలోని 432 పోలింగ్ కేంద్రంలోకి పదుల సంఖ్యలో తన అనుచరులతో వెళ్లినా పోలీసులుగాని, ఎన్నికల అధికారులుగాని అడ్డు చెప్పలేదు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించే అధికారులు ప్రధానమంత్రి వచ్చినా లేచి నమస్కారాలు చేయకూడదు. మంత్రి నిమ్మల రామానాయుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లగానే అక్కడ ఎన్నికల ప్రక్రియ నిర్వహించే అధికారులు అంతా లేచి నిలబడి ఆయనకు సలాం చేసిన తీరు అందరినీ నివ్వెరపర్చింది.

పాలకొల్లులో పట్టభద్రుల ఓటర్లకు ఓటుకు రూ.వెయ్యి పంపిణీపై పెద్దఎత్తున దుమారం రేగింది. పెదవేగిలోని 324, 325, 326, 327 పోలింగ్ కేంద్రాల్లో కూటమి నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై నిలదీసిన పిడిఎఫ్ శ్రేణులు, ఏజెంట్లు జి.శివకుమార్, పి.రామకృష్ణపై కూటమి నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, వారి అనుచరులు దాడికి పాల్పడటం గమనార్హం. ఆ సమయంలో తహశీల్దార్, ఎస్‌ఐ అక్కడే ఉన్నప్పటికీ పట్టించుకోని పరిస్థితి కన్పించింది. సదరు అధికారులు కూటమి నేతలకు సలాం కొట్టిన పరిస్థితి ఉంది. పోలింగ్ కేంద్రాల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి పెద్దఎత్తున హడావుడి చేయడమే కాకుండా భోజనాలు పెట్టడం, ఓటర్లను ఓటు వేయాలని బెదిరించడం, డబ్బులు పంపిణీ చేయడం విచ్చలవిడిగా సాగింది. కూటమి నేతల దౌర్జన్యాలపై ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోని పరిస్థితి ఉంది.


ఓటింగ్ ప్రక్రియ ఇలా..


జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1.అల్లూరిసీతారామరాజు	12	4,669	3,637	79.90
2.అంబేద్కర్ కోనసీమ	95	64,471	47,125	73.09
3.తూర్పుగోదావరి	92	62,970	42,446	67.41
4.ఏలూరు	66	42,282	29,651	70.13
5.కాకినాడ	98	70,540	47,150	66.84
6.పశ్చిమగోదావరి	93	70,052	48,893	69.80
మొత్తం	456	3,14,984	2,18,902	69.50


పాలకొల్లులో ఓటు వేసి చూపుతున్న అంగర


నరసాపురంలో ఆర్‌డిఒ దాసిరాజు


తణుకులో ఓటు వేస్తున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ


పెనుగొండలో..


తణుకులో..


నరసాపురంలో..


వీరవాసరంలో..


తణుకు రూరల్‌లో..


గణపవరం : ఓటు వేసేందుకు చంటి బిడ్డతో వస్తున్న మహిళ


యలమంచిలిలో..


ఉండిలో ఎస్‌పి


మొగల్తూరు : పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

పోలింగ్ సాగిందిలా..

ప్రజాశక్తి - తణుకు

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు గురువారం తణుకు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మొత్తం 12 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

కాళ్ల : కాళ్లలో రెండు పోలింగ్ బూత్‌ల్లో 70.17 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో 1,028 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 1465 ఓట్లకు గాను 1028 ఓట్లు పోలైనట్లు తహశీల్దార్ జి.సుందర్‌సింగ్ తెలిపారు.

తణుకు: కూటమి ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు ఖాయమని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికల)లో ఎంఎల్‌సి ఓటు హక్కును ఆరిమిల్లి రాధాకృష్ణ, సతీమణి కృష్ణతులసి వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పనితీరు పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని, ఈ నేపథ్యంలోనే పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించుకుంటామంటున్నారన్నారు.

గణపవరం: స్థానిక హైస్కూల్లో రెండు బూత్‌లు, డిగ్రీ కాలేజీలో ఒక బూత్ అధికారులు ఏర్పాటు చేశారు. 352 బూత్ వద్ద పోలింగ్ నత్తనడకగా సాగడం వల్ల ఓటర్లు బారులు తీరారు.

భీమవరం టౌన్: భీమవరంలో పోలింగ్ బూత్‌లను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) గురువారం సందర్శించారు. పిఎస్‌ఎం గరల్స్ హైస్కూల్, ఎస్‌సిహెచ్‌బిఆర్‌ఎం హైస్కూల్, లూథరన్ హైస్కూల్స్‌లో బూత్‌లను ఆయన సందర్శించారు.

యలమంచిలి: పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో 74.68 శాతం ఓట్లు పోలైనట్లు తహశీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ తెలిపారు. మొత్తం మండల వ్యాప్తంగా 2722 ఓట్లు ఉండగా వీటిలో 2033 పోలయ్యాయి.

ఆకివీడు : స్థానిక సరోజినీ నాయుడు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 75.1 శాతం పోలింగ్ నమోదైంది. 10 గంటల వరకు మందకొడిగా సాగిన ఎన్నిక పదిన్నర గంటలకు ఊపందుకుంది. అప్పటివరకు సుమారు 15 శాతం వరకు పోలైన ఓటింగ్ ఆ తర్వాత మధ్యాహ్నం ఒకటిన్నర వరకు జోరుగా సాగింది. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకున్నారు. దానికి ముందు ఇదే పట్టణానికి చెందిన రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ డిప్యూటీ సెక్రటరీ (సీనియర్ సివిల్ జడ్జి) హనుమంతు అమర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ పరిస్థితిని పర్యవేక్షించారు. ఆయన వెంట సిఐ జగదీశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు ఉన్నారు.

పెనుగొండ: పోలింగ్ బూత్‌లో పరిస్థితిని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ పరిశీలించారు. 72 శాతం పోలింగ్ నమోదైందని తహశీల్దార్ అనితకుమారి తెలిపారు.

గణపవరం: గణపవరంలో ఎంఎల్‌సి పత్తుమట్ల ధర్మరాజు గణపవరంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ ను పరిశీలించారు.

పెనుమంట్ర: మండలంలో పోలింగ్ 72.57 శాతం నమోదైందని తహశీల్దార్ వై.రవికుమార్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

అత్తిలి: స్థానిక ఎస్‌విఎస్‌ఎస్ అండ్ ఆర్ట్స్ కాలేజీలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సరళిని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఆయన వెంట తహశీల్దార్ దసిక వంశీ, ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వీరవాసరం: వీరవాసరంలో 74 శాతం పోలింగ్ జరిగినట్లు తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు తెలిపారు. మొత్తం 2241 మంది ఓటర్లకు గాను 1679 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళలు 711 మంది, పురుషులు 968 మంది ఉన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిపై ఆరా తీశారు.

ఉండి: జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ స్థానిక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. తహశీల్దార్ కె.నాగార్జున మాట్లాడుతూ 1532 మంది ఓటర్లకుగాను 1059 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

తాడేపల్లిగూడెం: పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ తెలిపారు. పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేశారు.

మొగల్తూరు: స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద, శిక్షణ డిఎస్‌పి డాక్టర్ కె.మానస సందర్శించారు. విప్ బొమ్మిడి నాయకర్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పోలింగ్‌ను పర్యవేక్షించారు.

ఇరగవరం: మండలంలో 1978 మంది ఓటర్లకుగాను 1480 మంది ఓటు వేశారు. వీరిలో 833 పురుషులు, 647 మహిళలు ఉన్నారు. ఇరగవరంలో 74.82 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహశీల్దార్ సుందర్రాజు తెలిపారు.

పాలకొల్లు : పట్టణంలో 10 పోలింగ్ బూత్‌ల్లో 71.76 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలో మొత్తం 7957 ఓటర్లకు 5710 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 4389 మంది పురుషులకు గాను 3147 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 3568 మంది మహిళలకు గాను 2563 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాలకొల్లు ఎంఎంకెఎన్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లోని 429 బూత్‌లో మంత్రి రామానాయుడు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పాలకోడేరు: మండలంలో మొత్తం ఓట్లు 2374 ఉండగా 1578 మాత్రమే పోలయ్యాయి. 66.47 శాతం పోలింగ్ నమోదయినట్లు తహశీల్దార్ విజయలక్ష్మి తెలిపారు.

నరసాపురం: పట్టణంలో మొత్తం 5475 ఓట్లు ఉండగా 3694 మంది ఓట్లు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్‌డిఒ దాసిరాజు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఇటు డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద కూడా పరిస్థితిని సమీక్షించారు. ఆర్‌డిఒ దాసి రాజు, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఆచంట: మండలంలో 70.6 శాతం ఓట్లు పోలైనట్లు తహశీల్దార్ కనకరాజు తెలిపారు. 1894 ఓట్లకుగాను 1338 ఓట్లు నమోదయ్యాయి.

అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమరవీరుల కోసం మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరపాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు కనపాల పెద్దిరాజు కోరారు. ప్రతి నియోజకవర్గంలో మండలాలు, గ్రామాల వారీగా పలు పార్టీలలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఐఎస్‌ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మాదిగల అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు.

ఓటర్లకు స్లిప్‌ల పంపిణీలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - వీరవాసరం

ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న శాసనమండలి ఎన్నికల్లో ఓటర్లకు స్లిప్‌లు ఇవ్వడంలో అధికార యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని వృత్తి సంఘాల నాయకులు విమర్శించారు. గురువారం వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు జుత్తిగ నరసింహమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు చేస్తున్న కృషికి అడ్డుకట్టవేయాలని వారి గెలుపుకు ఏదో విధంగా అడ్డుకట్ట వేసి కూటమి అభ్యర్థులను గెలుపించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తమ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించాలంటూ క్రింది స్థాయి అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారంటూ ఆయన ఆరోపించారు. పట్టభద్రుల నిరుద్యోగ ఓటర్లకు పోరాట యోధుడు పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరారాఘవులను ఓటర్లు గుర్తించారన్నారు. అటువంటి వ్యక్తికి ఓటు వేయడం ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశతో అధిక సంఖ్యలో ఓటర్లు పిడిఎఫ్ అభ్యర్థుల పట్ల మొగ్గు చూపడంతో వారికి ఓటు స్లిప్‌లు ఇవ్వకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించిందని తెలిపారు. వీర రాఘవులు విజయం కోసం నిరుద్యోగ, ఉపాధ్యాయ, రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక, చేతు వృత్తుల సంఘాల వారు చేసిన ముమ్మర ప్రచారం అధికార కూటమికి దడ పుట్టించాయన్నారు. ఈ సమావేశంలో బొర్రా ఆలమహారాజు, బాలం విజయకుమార్, పోతుల మృత్యంజయ, తాళ్లూరి రాము, కేతా జ్యోతిబసు, యండమూరి సుబ్బారావు పాల్గొన్నారు.

యథావిధిగా ప్రయివేటు పాఠశాలలు

ప్రజాశక్తి - వీరవాసరం

శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు సెలవు పాటించాలంటూ ఇచ్చిన ఆదేశాలను ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలు తుంగలోతొక్కాయి. గురువారం పోలింగ్ రోజున మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలూ సెలవు పాటించగా ప్రయివేటు విద్యా సంస్థలు మాత్రం యథావిధిగా పనిచేశాయి. అనేక సందర్భాల్లో ప్రభుత్వం ఇస్తున్న ఆదేశాల పట్ల ప్రయివేటు విద్యా సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శాసన మండలి ఎన్నికల పోలింగ్ రోజున ప్రయివేటు విద్యా సంస్థలు ప్రభుత్వ ఆదేశాలు మేరకు సెలవు పాటించకుండా ప్రయివేటు పాఠశాలలు పని చేయడం పట్ల అందులో పని చేస్తున్న పట్టభద్రుల ఓటర్ల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజా స్వామ్య వ్యవస్థలో తగిన సమయంలో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకుని వెసులుబాటు కూడా ప్రయివేటు పాఠశాలల యాజమాన్యం కల్పించకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి ఎం.శ్రీమన్నారాయణను వివరణ కోరగా ప్రయివేటు పాఠశాలలో పనిచేస్తున్న పట్టభద్రులు వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి సంబంధిత యాజమాన్యం అవకాశం ఇవ్వాలంటూ ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. శాసన మండలి ఎన్నికల పోలింగ్ రోజున ప్రయివేటు పాఠశాలలు సెలవు పాటించాలంటూ ఎటువంటి ఆదేశాలూ తనకు అందలేదన్నారు.

రాజర్షి ఫార్మాసిస్టు శ్రీనివాస్ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్



భీమవరం, ఉండి రోడ్డులోని రాజర్షి హాస్పటల్లో దారుణం చోటుచేసుకుంది. ఆసుపత్రిలో మూడున్నర సంవత్సరాలుగా ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం కరిచర్లగూడెం గ్రామానికి చెందిన ఖండవల్లి శ్రీనివాస్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై అనేక అనుమానాలు తలెత్తాయి. రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి శ్రీనివాస్ ఆసుపత్రికి వచ్చాడు. అయితే అర్ధరాత్రి సమయంలో ఆస్పత్రిలో ఉన్న మెడికల్ షాప్ పక్కనే నేలపై పడుకున్న శ్రీనివాస్ తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో స్పర్శ లేకుండా ఉన్నాడని డ్యూటీ నర్స్ గమనించి పైఫ్లోర్‌లో ఉన్న డాక్టర్ రాజర్షికి సమాచారం అందించింది. ఆయన వచ్చి చూసి శ్రీనివాస్ మరణించినట్లు ధ్రువీకరించారు. వెంటనే కరిచర్ల గూడెంలో ఉన్న శ్రీనివాస్ బంధువులకు సమాచార ఇవ్వడంతో వారు ఆసుపత్రికి వచ్చి శ్రీనివాస్ మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని, తన తమ్ముడికి ఎటువంటి చెడు అలవాట్లూ లేవని, డాక్టర్ రాజర్షి మాత్రం మత్తుమందు తీసుకోవడం వల్లే చనిపోయినట్లుగా చెబుతున్నారని, ఇది వాస్తవం కాదని వెల్లడించారు. తన తమ్ముడిని అన్యాయంగా చంపేశారని, తమకు న్యాయం జరగాలని ఆస్పత్రి బయట గ్రామస్తులతో కలిసి ఆందోళన చేశారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించగా మృతుని జేబులో ఇంజక్షన్ నీడిల్, మేజోలం ఇంజక్షన్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డాక్టర్ రాజర్షి మీడియాతో మాట్లాడుతూ ఆపరేషన్ చేసేటప్పుడు ఉపయోగించే మత్తు మందు తీసుకోవడం వల్లే శ్రీనివాస్ మరణించారని తెలిపారు. ఘటనపై టూ టౌన్ పోలీసులు అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పాలకొల్లులో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్న విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. 33/11 కెవి పాలకొల్లు సబ్ స్టేషన్ వద్ద 11 కెవి పాలకొల్లు టౌన్-1 ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం టౌన్ పరిధిలోని వరిధనం రోడ్డు, మెయిన్‌రోడ్డు, శంబునిపేట, పెద్దగోపురం ప్రాంతం, పోస్ట్ ఆఫీస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

మద్యం కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగ ప్రభుకుమార్

అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన కేసులో నరసాపురంలోని 8వ వార్డు కౌన్సిలర్ బర్రె జయరాజును అతనికి సహకరిస్తున్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కెవి.నాగ ప్రభుకుమార్ అన్నారు. గురువారం ఎక్సైజ్ స్టేషన్లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బుధవారం కొప్పర్రు గ్రామంలో దిడ్ల రామకృష్ణ, గొల్లమందుల రాజబాబు, కత్తిమండ జయబాబు అక్రమంగా మద్యంను నిల్వ చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో బర్రె జయరాజుకు చెందిన చేపల చెరువు వద్ద దాడులు నిర్వహించామన్నారు. చెరువు వద్ద షెడ్డులో అక్రమంగా నిల్వ చేసిన గోవాకు చెందిన 86 అట్ట పెట్టిలో ఉంచిన 4125 మందు బాటిళ్లను సీజ్ చేశామన్నారు. జయరాజు మరో ముగ్గురితో కలిసి కొంత కాలంగా యానంకు చెందిన కోనాల భరత్‌రెడ్డి నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని తీసుకొచ్చి లోకల్‌గా విక్రయిస్తున్నారన్నారు. ఎంఎల్‌సి గ్రాడ్యుయేట్ ఎన్నికల తనిఖీల్లో భాగంగా సుంకం చెల్లించని మద్యం కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా జయరాజు అక్రమ మద్యం అమ్మకాల బాగోతం భయటపడిందన్నారు. మద్యం సప్లై చేసిన భరత్‌రెడ్డి ప్రస్తుతం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారీలో ఉన్నాడని, త్వరలో భరత్ ను అరెస్ట్ చేస్తామని తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు సిహెచ్ అజయ్‌కుమార్ సింగ్, ఆర్‌వి.ప్రసాద్ రెడ్డి, ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతిలోనే

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన ఆరోగ్య పరిరక్షణ మన చేతిలోనే ఉందని, అనారోగ్య కారకమైన ప్లాస్టిక్ నిషేధం మనందరి కర్తవ్యమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కోట్ల నాని అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపురం రోడ్డులోని తాడిమళ్లవారి కాంప్లెక్స్ వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి గుడ్డ సంచులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయడమే లక్ష్యంగా భావించి అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. ప్రచార కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేధంపై వాడవాడలా అవగాహన, ప్రచార సదస్సులు ర్యాలీలు చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా గుడ్డ సంచులనే వినియోగించాలని అన్నారు. దేవి జ్యుయలర్స్ అధినేత కోట్ల నాని స్పందించి 500 గుడ్డ సంచులకు సహకారం అందించారని తెలిపారు. అనంతరం 100 గుడ్డ సంచులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో పున్నాని కనకయ్య, బొండా హనుమంతరావు, కనగర్ల కిషోర్, కంచర్ల భాస్కర్ గుప్తా, పులపర్తి రామకృష్ణ, బంగారు ప్రసాద్, బొండాడ మనీష్, కొల్లేపర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

రాజశేఖరం గెలుపు తథ్యం : ఎంఎల్‌ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం 50 వేల నుంచి లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మీడియాతో మాట్లాడుతూ రాజశేఖరం గెలుపునకు అందరం కలిసికట్టుగా పని చేశామన్నారు. సంవత్సరంలో అన్ని రోడ్లూ నిర్మిస్తామని ఛాలెంజ్ చేస్తున్నామన్నారు. ప్రజాభీష్టం మేరకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అక్షరాస్యుల ఓట్లతో గెలవబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి లయన్స్ క్లబ్ పరిశీలన

ఉండి: ఉండి లయన్స్ క్లబ్‌ను గురువారం జిల్లా లయన్స్ గవర్నర్ కాకరాల వేణుబాబు సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు క్లబ్ అధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా గవర్నర్ వేణుబాబు మాట్లాడుతూ జిల్లా క్లబ్‌లో ఉండి లయన్స్ క్లబ్ ప్రత్యేకతను చాటుకుటుందన్నారు. పేదలకు దుప్పట్లు, సన్ రైజ్ వృద్ధాశ్రమానికి రూ.పది వేలు, ఉండి జెడ్‌పి విద్యార్థులకు పౌష్టికాహారం కోసం రూ.15 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి.సూర్యనారాయణరాజు, ఆర్‌సి కృష్ణమూర్తి, జెడ్‌సి కృష్ణంరాజు, శివరామరాజు, నరసరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు, కాగిత మహంకాళి పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ మృతి

నరసాపురం: మండలంలోని కొప్పర్రు కొత్తపేటకు చెందిన వివాహిత గోడి కరుణకుమారి (25) బుధవారం సాయంత్రం ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త గల్ఫ్‌లో ఉంటాడని స్థానికులు తెలిపారు. కొప్పర్రులో ఉరి వేసుకుని అనుమానాస్థితిలో మృతి చెందిన కరుణకుమారి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్ తెలిపారు. మృతి గల కారణాలు తెలియాల్సి ఉంది.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

అన్నదానం గొప్పది

ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం వీరమ్మ పార్క్ సెంటర్లోని పార్వతీ సమేత భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన అన్న సమారాధనను ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. ముందుగా భోగలింగేశ్వర స్వామివారికి అభిషేకం చేసి మహా నివేదన చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 3000 మంది స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, వి.రామకృష్ణ, బండి రమేష్‌కుమార్, ఇందుకూరి రామలింగరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని కోట రోడ్డులోని శ్రీ దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమరాధన చేశారు. యాత్రికులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.